

కొత్తపల్లిలో వికసించిన బ్రహ్మ కమలాలు

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

కనువిందు చేసే బ్రహ్మ కమలాల పువ్వులు కొత్తపల్లిలో శనివారం ఆరు వికసించాయి. కొత్తపల్లికి చెందిన జోకా బూరయ్య, జోకా రాంబాబు ఇంటిలో ఈ బ్రహ్మ కమలాలు వికసించాయి. మూడు సంవత్సరాల క్రితం రాజమండ్రి నుంచి ఒక ఆకు తెచ్చి వారి పెరట్లో వేశామని చెప్పారు. ఇప్పటి వరకు 20 పైబడి బ్రహ్మ కమలాలు వికసించాయని రాంబాబు చెప్పారు. వికసించిన పువ్వులను చూసేందుకు ప్రజలు పోటీపడ్డారు.



వికసించిన బ్రహ్మకమలాలు

రాజ్యాంగ పరిరక్షణతోనే హక్కులకు రక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించకపోతే మణిపూర్ తరహాలో దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు మనువాద రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు హెచ్చరించారు. శనివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘంల ఆధ్వర్యంలో దళితులపై దాడులు, చట్టాల అమలు, భూమి సమస్యలు, శ్మశాన సమస్యలు, అసైన్మెంట్ భూముల చట్ట సవరణపై అవగాహన సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బి.సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన దడాల సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో బిజెపి పాలన మొదలైన తర్వాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, రాజ్యాంగంలో ఉన్న ముఖ్యమైన అంశాలను పక్కకు తోస్తూ మనువాద రాజ్యాంగము అమలు చేస్తున్నారని విమర్శించారు. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడం అంటే బ్రాహ్మణ పెత్తనాన్ని దేశం మొత్తం చలాయించడానికి బిజెపి ప్రభుత్వం చూస్తుందని, ఇది చాలా దుర్మార్గపు చర్య అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించకపోతే దేశాన్ని ఐక్యంగా ఉంచలేమన్నారు. దళితులపైన ముస్లింల పైన క్రిస్టియన్ల పైన దాడులు అధికమవుతున్నాయని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కాపాడుకోవాలన్నారు. గుజరాత్ రాష్ట్రంలో 2000లో అప్పటి మోడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏం జరిగిందో ఇప్పుడు మణిపూర్లో అదే సంఘటన చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 9/77 యాక్ట్ అసైన్మెంట్ భూములకు రక్షణగా ఉండని, అలాంటి చట్టాన్ని జగన్ ప్రభుత్వం సవరణ చేసి దళితుల చేతిలో భూములు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఈ జీవు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దళిత సంఘం సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో దళితులకు చనిపోయిన తర్వాత పాతి పెట్టడానికి శ్మశానం కూడా పెద్ద సమస్యగా ఉందని విమర్శించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో ప్రభుత్వాలు పేదలకు పెంచిన అసైన్మెంట్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కొన్నిచోట్ల భూములు ఉన్నా పట్టాలు లేవని ఈ సమస్యల కోసం సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సదస్సులో దళితులకు సంబంధించిన 22 డిమాండ్లను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. ఈ సదస్సులో దళిత నాయకులు సబ్బతి పనేశ్వరరావు, కాశి బాలయ్య, మోతా కృష్ణమూర్తి, వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, విప్పర్తి శ్రీనివాస్, పొలాపూర్ గోపాలకృష్ణ, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

గృహ నిర్మాణ పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి-కాకినాడ

నవరత్నాలు- పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించి ఎంపిక చేసిన లేఔట్లలో మిగిలిన పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శనివారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల గృహాల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రతి జిల్లాకు ఒక్కో లేఔట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టనున్నదన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో సామూహిక గృహప్రవేశాలకు సంబంధించి ఎంపిక చేసిన లేఔట్ లో గృహ నిర్మాణాలు, అంతర్గత రహదారులు, మురికి కాలువలు ఇతర మౌళిక సదుపాయాల కల్పన పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి రానున్న ఆగస్టు 20 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సిఇఒ ఎ.రమణా రెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, డిపిఒ ఆర్.విక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పశుసంవర్థక శాఖ జెడి ఎస్.సూర్యప్రకాశరావు, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్ పాల్గొన్నారు.



టెలి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి : డిఐజి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజ్ డిఐజి జీవీజీ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు అధికారులు పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో గత మూడేళ్లతో పోలిస్తే గడిచిన 6 నెలల కాలంలో నేరాలు గణనీయంగా తగ్గాయని ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. జిల్లాలో రోడ్డుప్రమాదాలు, పోక్సో, ప్రాపర్టీ నేరాలు తగ్గాయన్నారు. సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైబర్, లోన్‌యాప్, బ్యాంక్ ఫ్రాడ్స్, అకౌంట్ హ్యాకింగ్స్‌పై ప్రత్యేక దష్టి సారించి వారధి కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం హైవే రాబరీ, ఇతర ప్రాపర్టీ కేసుల్లో రివకరీలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు డిఐజి ప్రసంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు మురళీకృష్ణారెడ్డి, లతాకుమారి, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.



అధికారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డిఐజి

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహశీల్దారు జితేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత నెలలో సుమారు 55 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించారన్నారు. అనేకమంది రీ అపోర్షన్ ద్వారా సర్దుబాటు చేయబడ్డారన్నారు. వందలాది పాఠశాలల్లో హెడ్మాస్టర్ పోస్టు రద్దు చేశారన్నారు. ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నెలవారి జీతాలు కూడా ఇంకా చెల్లించ లేదన్నారు. సెకండ్ ఎంఇఒలను ప్రభుత్వం నియమించాందని కానీ వారికి కూడా వేతనాలు ఒదలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం లేదని వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్ రాజు, చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి, విటి.ఆచార్యులు, సి.విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ

తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి


ప్రజాశక్తి-కాకినాడ

దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని ఐలు రాష్ట్ర నాయకులు డి.రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 6వ మహాసభ కాకినాడ బార్ అసోసియేషన్‌లో జిల్లా అధ్యక్షులు మేడపాటి ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే న్యాయవాదుల సంఘంలో ఐలు అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం అని పేర్కొన్నారు. ఐలు న్యాయవాదుల సమస్యలతో పాటు ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక సంఘం అన్నారు. మూడేళ్లలో ఐలు చేసిన కార్యక్రమాల నివేదికను భాస్కరాచార్యులు ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా, నగర కమిటీలను ఎన్నుకున్నారు.

మంత్రి రాజాకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-కోటనందూరు

రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాతృమూర్తి నారాయణమ్మ మరణించడంతో శనివారం ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, ఎంఎల్ఎ పర్వత ప్రసాద్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎసి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, ప్రముఖ వైద్యులు దుర్గాదాస్, మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు మంత్రి రాజాను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



నారాయణమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి వేణు

జిఒ నెంబర్ 102 108ను రద్దు చేయాలి

కాకినాడ : ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, పేద ప్రజల నోట్లో మట్టికొట్టి రాజ్యాంగానికి విరుద్ధంగా సంపన్న వర్గాలకు వైద్య విద్యను అందించేందుకు సహకరించే జిఒ నెం 107, 108లను రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కలెక్టరేట్లో డిఆర్ఒ శ్రీధర్ రెడ్డికి వారు వినతిపత్రం అందించారు. 5 మెడికల్ కాలేజీలకు రిజర్వేషన్లు పాటించక పోవడం వల్ల ఎస్‌సిలు 50 సీట్లు, ఎస్‌టిలు 20 సీట్లు, బిసిలు 185 సీట్లు నష్టపోతున్నారన్నారు. రాబోయే 12 మెడికల్ కాలేజీల్లో కూడా భారీ స్థాయిలో నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు దుర్గా రమేష్, చొల్లంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కస్తూరిబా కేంద్రంలో జిసిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-శంఖవరం

మండల కేంద్రమైన శంఖవరంలో ఉన్న కస్తూరిబా గాంధీ కేంద్రాన్ని గర్ల్స్ చైల్డ్ అభివద్ధి అధికారి పి.ఉమా మహేశ్వరి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తనను కలిసిన ఆమె మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో తన పరిధిలో నాలుగు కస్తూరిబా కేంద్రాలు, మోడల్ స్కూల్ సంబంధించిన హాస్టల్ పనితీరుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రతి కస్తూరిబా కేంద్రంలోని నిబంధనలు అనుసరించి 280 విద్యార్థినులు క్లాస్‌కు 40 మంది మాత్రమే ఉంటారని ఆమె చెప్పారు. ఆయా కేంద్రాల్లో ఉండే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను మెనూ ప్రకారంగా ఆహార పదార్థాలను సకాలంలో అందిస్తున్నారా ఎప్పటికప్పుడు తన తనిఖీల ద్వారా తెలుసుకొని లోపాలు ఉంటే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కేంద్రంలోనూ విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదులు బాక్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

కార్టూ'నిజం'





స్టడీ మెటీరియల్ అందిస్తున్న వీరబాబు

గ్రామీణ విద్యార్థులు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-కోటనందూరు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దళిత విద్యార్థుల అభింవృద్ధి చెందాలనే లక్ష్యంతోనే భీమవరపుకోట దళిత వాడలో అంబేద్కర్ సామాజిక గ్రంథాలయాన్ని గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జగటాల వీరబాబు అన్నారు. నవోదయ, ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు సెలెక్ట్ కావాలని విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు నెమ్మది రామారావు మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన పుస్తకాలన్నీ గ్రంథాలయంలోనే ఏర్పాటు చేశామన్నారు. బైబి.పట్నంకు చెందిన బాదం జాన్ పాల్ గ్రంథాలయానికి రూ.30,000 విలువైన పుస్తకాలను, స్కూలు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కొత్తపల్లి మాణిక్యాలరావు, నాగులపల్లి అప్పారావు, పద్యి సునీల్, నవీన్, రాజు, ప్రసాద్, రాజు, యేసురత్నం గణేష్, దండా కొండా బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబుకు వరుపుల పరామర్శ

ప్రజాశక్తి -రౌతులపూడి

ప్రతిపాడు మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు ఇటీవల గాయపడిన బొమ్మిడి సత్తి బాబును శనివారం మండల కేంద్రమైన రౌతులపూడి లోని ఆయన నివాసంలో పరామర్శించి ప్రమాదం జరిగిన కారణాలను సత్తిబాబు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపిపిలు గొల్లపల్లి బుజ్జి, గంటిమల్ల రాజ్యలక్ష్మి, వాసిరెడ్డి జమీలు ఉన్నారు

కోనాడకు వైసిపితో సంబంధం లేదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపిలో చేరిన కోనాడ ప్రకాశరావుకు తమ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని వైసిపి నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న స్పష్టం చేశారు. 16వ డివిజన్ ఇంచార్జ్ టిడిపిలో చేరిక అంటూ పత్రికల్లో వచ్చిన ప్రకటనపై ఆమె స్పందించారు. 2021లో జరిగిన ఉప ఎన్నికలో కోనాడ ప్రకాష్ రావు వైసిపి టికెట్ ఆశించగా సీనియర్ కావడంతో పేర్ల జోగారావుకు టికెట్ ఇచ్చారన్నారు. టికెట్ ఇవ్వకపోవడంతో ప్రకాష్ స్వతంత్రంగా పోటీ చేసి ఓటమిపాలయ్యారన్నారు. ఆ రోజు నుంచే కోనాడకు వైసిపితో సంబంధం లేదని చెప్పారు.



కరపత్రాలు పంచుతున్న సూర్యకిరణ్

జనసేన కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలో జనసేన పార్టీ నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్ శనివారం కరపత్రాల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీని ఆదరించాలని కోరారు. 37 రకాల హామీలతో కూడిన జనసేన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరణం సుబ్రహ్మణ్యం, నిర్జ నాగు, సతీష్ పాల్గొన్నారు.

9 నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవ్

ప్రజాశక్తి -కరప

ఈ నెల 9 నుంచి నిర్వహించనున్న ఆజాదీకా అమృత మహోత్సవ్‌పై అధికారులతో ఎంపిడిఒ కె.అప్పారావు సమావేశం నిర్వహించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలలో ఆజాదీకా అమత మహోత్సవంలో భాగంగా మండల పంచాయతీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన వివిధ కార్యక్రమాలను నిర్వర్తించాలని ఎంపిడిఒ అప్పారావు కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర కుమార్, వీరభద్రరావు, బ్రహ్మానందం, శ్రీనివాస్, ఉమామహేశ్వరి, రవికుమార్, చంద్రకళ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - తాళ్లరేవు

వరద బాధితులు అందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. పిల్లంక పంచాయతీ కొత్తలంకలో 147 మందికి బియ్యం, నిత్యవసరాలను ఎంపిపి సునీత, జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా చింతలపాటి శ్రీనివాస్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో వీరు మాట్లాడారు. తహశీల్దారు పోతురాజు, ఎంపీడీవో ఎం.అనుపమ, వైకాపా మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఉప సర్పంచ్ కాగిత రాజు, ఎంపీటీసీ మోర్త భీమాబాయి, గోపాలకృష్ణ, అంగన్వాడీ సుజాత పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపకపోతే ఆందోళన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నివాసాల మధ్య గ్రామ నడిబొడ్డున నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని, లేదంటే భారీ ఎత్తున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని ఉండూరు గ్రామస్తులు హెచ్చరించారు. నివాసాల మధ్య జరుగుతున్న సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ శనివారం గ్రామ ప్రజలు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును కలసి వినతి పత్రాన్ని అందజేశారు. సెల్ టవర్ నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా గర్భిణులు, చిన్నపిల్లలు, పశుపక్షాదులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కారణంగా గ్రామంలో నిర్మాణం అవుతున్న టవర్ పనులు తక్షణమే నిలుపుదల చేసి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని వారు కోరారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు.

వైసిపికి సుంకరపాలెం సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైసిపి సభ్యత్వానికి, మండల వాణిజ్య విభాగం కన్వీనర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టిల్లపూడి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సుంకరపాలెం పంచాయతీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. తన సొంత స్థలంలో సుంకరపాలెంలోని సర్వే నెంబర్ 123, 125, 126/5 లోని 7 సెంట్లు స్థలంలో షెడ్డు నిర్మాణం చేసుకుంటే పార్టీ నాయకుల సమక్షంలో అధికారులు తన షెడ్డును తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్వే నెంబర్లలో సుమారు 63 మంది ఉన్నప్పటికీ ఎవ్వరి మీదా చర్యలు తీసుకోకుండా తనపైనేకక్ష సాధించారని తెలిపారు. 2011 నుంచి 13 ఏళ్ల పాటు వైసిపికి ఎనలేని సేవలు అందించానన్నారు. వాటిని పరిగణలోకి తీసుకోకుండా తనకు అన్యాయం చేశారని తెలిపారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కోర్టులో ఉన్న నా స్థలంలో నిర్మాణాలు తొలగించడం బాధ కలిగిందని అన్నారు. సర్పంచ్ పదవిలో ఉన్న తనకే ముందస్తు నోటీసులు ఇవ్వకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్థానిక నాయకుల వల్ల పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పెదపూడి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కాకినాడ లయన్స్ క్లబ్ మైత్రీ జిల్లా చైర్మెన్ కెవెల్.నరసింగరావు, అధ్యక్షుడు ఎ.వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో గండ్రేడు, కుమారప్రియం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిల్స్, స్వీట్లను శనివారం కాకినాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులలో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పి.ఆనందరావు ఉపాధ్యాయులు, కె.రాజేష్, ఎల్.ఐ.సి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కరప

వేళంగిలో లయన్స క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం చేసినట్టు డాక్టర్ బొండ సూర్యరావు తెలిపారు. శనివారం ఈ కార్యక్రమం బొడ్డు భాస్కర రామన్ అధ్యక్షతన నిర్వహించగా అధ్యక్షులుగా మెర్ల రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా బొండా సూర్యనారాయణ, కోశాధికారిగా ఇల్ల ఆదేశ్, డాక్టర్ బొండ సూర్యరావు మెంబర్షిప్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మెర్ల సీతారామ ప్రసాద్, పాతూరి శ్రీహరి, చెక్క బాలకృష్ణ పాల్గొన్నారు.



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శృంగార వల్లభస్వామికి ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,90,430, అన్నదానం విరాళాల ద్వారా రూ.71,193, కేశ ఖండన ద్వారా రూ.8,100 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్త మాచార్యులు, అంజనీ కుమార్, ధర్మకర్తలు పుల్లేటి కుమారి, ఎ.లక్ష్మి, రాకుర్తి కుమారి, వెంకటరమణ, జగ్గారావు, శివ పాల్గొన్నారు.

పోషకాహార కిట్లను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందచేస్తున్న సంపూర్ణ పోషక విలువలుగల ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదబ్రహ్మదేవం సీనియర్ ఎంపిటిసి మలకల సూర్యారావు పిలుపునిచ్చారు. శనివారం పంచాయితీ వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం, తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సులో సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సూర్యారావు మాట్లాడారు. అనంతరం గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం కిట్లును పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వైవిబి ప్రసాదరావు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, అంగన్వాడీ సూపర్‌వైజర్ నిర్మలా కుమారి, వైద్యులు డాక్టర్ దివ్యవాణి, అంగన్వాడీలు ఆశాలు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న సూర్యారావు

సమస్యలపై హామీ పట్ల హర్షం

ప్రజాశక్తి -కాకినాడ కార్పొరేషన్

రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ లభించడం పట్ల కాకినాడ జిల్లాకు చెందిన రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కాకినాడ శాంతి నివాస్ భవన్‌లో అభినందన సభను కాకినాడ జిల్లాలోని పలు మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీనివాసు మాట్లాడుతూ జులై 23న విజయవాడలో నిర్వహించిన రేషన్ డీలర్ల సభలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరై రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారన్నారు. ఆ సభకు జిల్లా నుంచి వెయ్యి మంది హాజరవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడులో నాటు తుపాకీ, మందు గుండు కలిగిన వ్యక్తిని కడియం పోలీసులు అరెస్ట్ చేశారు. కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన మానుపూడి దుర్గారావు వేమగిరిలో నివాసం ఉంటున్నాడు. అతడి వద్ద దేశీయంగా తయారు చేసిన సింగల్ బోర్ గన్, దానితో ఉపయోగించే మందు గుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రెండు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

మండలంలోని రెండు ఘటనల్లో గడ్డి మందు తాగి ఇరువురు మృతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. కాట్రావులపల్లికి చెందిన రాయుడు సత్యనారాయణ (67) కాళ్ళ నొప్పులు తాళలేక మద్యంతో పాటు గడ్డి మందు తాగడంతో బంధువులు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా శనివారం మరణించినట్లు తెలిపారు. మల్లిశాల గ్రామానికి చెందిన బొజ్జి ... భార్యతో గొడవ పడి గడ్డి మందు తాగాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

కట్నం కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి –తాళ్లరేవు

జీలేల గాడిమొగ పంచాయతీ పెద వలసలలో వివాహిత మహాలక్ష్మి మరణించిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. రామన్నపాలెంకు చెందిన పంతాడి నూకరాజు, పంతాడి చిన్న నూకరాజు, పంతాడి ధనలక్ష్మి, పంతాడి వెంకటేశ్వరులు, కాకినాడ జగన్నాధపురానికి చెందిన ఓలేటి నర్సిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

ప్రజాశక్తి-కడియం

ప్రేమించానని వెంటపడి, యువతిని మోసం చేసిన యువకుడి మీద కడియం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జేగురుపాడు గ్రామానికి చెందిన ఒక యువకుడు అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించానంటూ, ఆమె వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. మూడు నెలలుగా ఆమెను శారీరకంగా లోబరుచుకున్నాడు. తీరా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చేసరికి ముఖం చాటేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలువలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి – సీతానగరం

శనివారం మిర్తిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తొర్రిగడ్డ కాలువలో గల్లంతయ్యాడు. పీతల శ్రీను కాలువ వద్ద చేపల కోసం వెళ్లి మిర్తిపాడు నుండి బొబ్బిల్లంక వెళ్లే తొర్రిగడ్డ కాలువ వంతెన పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి–అమలాపురం రూరల్

బండారులంక గ్రామం బ్యాంకు కాలనీకి చెందిన పడవల దేవి శుక్రవారం నుంచి కనిపించడం లేదని ఆమె భర్త వీర సుబ్బారావు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440796562 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పరదేశి చెప్పారు.

ఆదిత్య విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి–కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థి యువత మారుతున్న వాతావరణం, ఎలక్ట్రికల్ డివైసెస్ వాడటం కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన కంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని శ్రీ కిరణ్ ప్రోగ్రామ్ మేనేజర్స్ కార్తీక్, రఘురాం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్స్ శేష, విజయ, శంకర్ పాల్గొన్నారు.

పథకాలు అందరికీ అందాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందివ్వడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు అన్నారు. శనివారం కొత్తపల్లిలో రెండో రోజు గడపగడప కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. పలువురు ఎంఎల్ఎకు గ్రామంలో సమస్యలు వివరించారు. అనంతరం స్థానిక నాయకులు గ్రామస్తులు ఎంఎల్ఎను పుష్పమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గవర రాజేశ్వరి నాగేశ్వరరావు, పాలని దొరబాబు, వైస్ సర్పంచ్ పొన్నగంటి రామకష్ణ, సానా నాగు, సత్తిరాజు ఆనాల సుదర్శన్ తదిత నాయకులు పాల్గొన్నారు. పిఠాపురం ఎంఎల్ఎ దొరబాబు తీరుపై కొత్తపల్లి వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు అసంపూర్తిగా ఉన్నారు. దీంతో రెండో రోజు నిర్వహించిన గడపగడప కార్యక్రమానికి ఆయన గైరాజరయ్యారు.

ప్రగతిలో గ్రీన్ బిల్డింగ్స్‌పై సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రీన్ బిల్డింగ్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బాదం సుందరరావు, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారుని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణారావు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు %ూజజజజు% యొక్క విధి విధానాలను వివరిస్తూ, గ్రీన్ బిల్డింగ్స్ గురించి తెలిపారు. దీనిలో భాగంగా వేస్ట్ మేనేజ్మెంట్, ఎనర్జీ ఆప్టిమైజేషన్, సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కె.సరోజారాణి, ఎం.వి.హరనాథ బాబు, ఎం.సతీష్, డైరెక్టర్ ఎస్.శంభు ప్రసాద్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రధాన ఎన్నికల అధికారిగా జవహర్

ప్రజాశక్తి – యానాం

పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారిగా పి.జవహర్‌ను నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇంతవరకు కలెక్టర్ ఈ వల్లవన్ ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.



కనకాల పేట వద్ద కూలిన రక్షణ గోడ

నదిలో కలిసిపోతున్న లంక భూములు

ప్రజాశక్తి – యానాం

కనకాలపేట గ్రామాన్ని ఆనుకుని ఉన్న లంక భూములు గోదావరి నదీ గర్భంలో కలిసిపోతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది వచ్చిన వరదలతో ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న రివిట్మెంట్ 20 మీటర్ల మేర గోదావరి వరద తాకిడికి కోతకు గురైంది. ఎన్నోసార్లు ఈ సమస్యపై అధికారులకు విన్నవించినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో ఈ సంవత్సరం జూలై లో వచ్చిన వరదకు 40 మీటర్లకు చేరుకుందని వారు వాపోయారు. గౌతమీ గోదావరి వరద ఉధతి పెరగడంతో లంకలు కోతలకు గురవుతున్నాయని, కొబ్బరి చెట్లు సైతం గోదావరి నదిలో కలిసిపోతున్నాయని అంటున్నారు.

ఇండోర్ స్టేడియం మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి – యానాం

స్థానిక వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల పైకప్పు, జిమ్ రూమ్, ఫ్లోరింగ్ తదితర మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వంతో కలిసి శనివారం పరిశీలించారు. నాణ్యమైన మెటీరియల్స్ ఉపయోగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జెఇలు పిల్లి భాస్కర్, యాళ్ల వీరాస్వామి, ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జి నక్కల సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజురోజుకీ వేడెక్కుతున్నాయి. అధికార పార్టీలో ముఖ్యనాయకుల మధ్య సమన్వయ లోపం గురించి తెలిసిందే. ప్రతి నియోజకవర్గంలోనూ పరిపాటిగా మారాయి. ప్రధానంగా కోనసీమలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి వేణు వర్గాల మధ్య ఉన్న విభేధాలు ఒక్కసారిగా బహిర్గతం కావటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకుని సర్ది చెప్పినట్లు తెలుస్తోంది. తాజా రాజానగరం ఎంఎల్ఎ సోదరుడు జక్కంపూడి గణేష్ అదే పార్టీకి చెందిన యువజన నాయకుడిని దుర్భాషలాడినట్లు వస్తున్న వార్తలు రాజమహేంద్రవరంలో చర్చనీయాంశమయ్యాయి. తాజా పరిణామాలు జిల్లాలో మరో సారి కలకలం రేపుతున్నాయి. మరో వైపు పుంగనూరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై రాళ్ల రువ్వటం జిల్లా రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగ మారింది. అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందంటూ టిడిపి శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాజకీయ పరిణామాలు రోజు రోజుకీ మారుతున్నాయి. ఆశావహులు పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం క్యూ కడుతున్నారు. సిట్టింగ్‌లలోనూ టికెట్ భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కడికక్కడ తమ ముఖ్యనాయకులు తమ ప్రాభవాన్ని చాటుకునేందుకు



నాయకులు పోటీపడుతున్నారు.

తగ్గిన వరద... మిగిలిన బురద

కంటిమీద కునుకు లేకుండా 10 రోజుల పాటు కొనసాగిన గోదావరి వరద ఎట్టకేలకు ఈ వారం శాంతించింది. ఎగువ రాష్ట్రాలలో కురిసిన వర్షాలతో పాటు జిల్లాలోనూ కురిసిన వర్షాలు తోడవటంతో ప్రవాహం మరింత పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గరిష్టంగా 15 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో కోనసీమలోని 9 మండలాల్లో వరద ప్రభావం చూపించింది. 30 గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధం అయ్యాయి. ఫలితంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రవాహం వేగం ఉన్నప్పటికీ నిత్యావసరాల కోసం పడవలపై ప్రయాణం చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందించడంలో వెనుకబడింది. తాగునీరు సైతం అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డామని కొంతమది ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెలలో మరో సారి వరద రానుందనే హెచ్చరికలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. గోదావరి వరదల నుంచి కొంత ఊరట కల్పించందుకు లంక గ్రామాలను కలుపుతూ వంతెనలు నిర్మిస్తామంటూ పాలకులు చేసిన వాగ్ధానాలు నీటిమీద రాతలుగా మిగిలాయి. అదే విధంగా గోదావరి గట్ల పటిష్టత ప్రశ్నార్థకంగ మారింది. ఇప్పటికైనా పాలనా యంత్రాంగం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. తాజా వరదల నేపథ్యంలో పంట నష్ట జరిగింది. ఉద్యానపంటలుపూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు త్వరిత గతిన చర్యలు చేపట్టి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. టమోటా ధరలు గరిష్టంగా కేజీ రూ.140 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. రైతు బజార్‌లో సబ్సిడీ టమోటా కోసం కొనుగోలు దారులు గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపుగా నెల రోజులుగా ధరలు కొండదిగనంటున్నాయి. మరో వైపు బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. సన్నరకం బియ్యం మార్కెట్లో కొనుగోలు చేయాలంటే రూ.60 పైమాటే. ఇప్పటికైనా పాలకులు చొరవతో ధరలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మణిపూర్ అమానుషాలపై నిరసనలు

మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనలపై ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, క్రైస్తవ సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఈ వారంలో మిన్నంటాయి. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐద్వా సంఘం ఆధ్వర్యాన చేపట్టిన ర్యాలీకి జిల్లాలో విద్యార్థులు, ప్రజాస్వామ్య వాదులు బ్రహ్మరథం పట్టారు. మణిపూర్ ఘటనలు కలవరానికి గురి చేశాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

జగన్నాథపురం కోకిల రెస్టారెంట్ నుంచి హీరో హోండా షోరూం వరకు రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. శనివారం జగన్నాథపురం వాసవి కళ్యాణ మండపం రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్నాథపురం వరకు రోడ్డు విస్తరణ చేపట్టినట్టు చెప్పారు. ఆనందభారతి నుంచి వైఎస్ఆర్ బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ చేపట్టమన్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు ఆస్తి విలువలు పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు చోడిపల్లి ప్రసాద్, నంద, దుర్గాప్రసాద్, అదరపు కమిషనర్ నాగ నరసింహారావు, సిటీ ప్లానర్ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 'నా భూమి నా దేశం'

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం ఎంపిడిఒ బిఎస్‌కె.రామన్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నా భూమి- నా దేశం కార్యక్రమంపై పంచాయతీ మండల పరషత్ అభివద్ధి అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం, వసుధకు వందనం, స్వాతంత్ర్య సమరయోధులు మరియు వీరుల కుటుంబీకులను సత్కరించడం వంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దస్తావేజులు పడిపోయినవి

పెద్దాపురం సత్తిరెడ్డిపేట నివాసి అయిన ఉండవిల్లి వీర వెంకట రంగనాథ్ అను నేను తెలియజేయునది ఏమనగా.., నాకు పెద్దాపురం సత్తిరెడ్డిపేటలో డో.నెం.7-7-7/సి పెంకుటిల్లు కలదు. దీనికి సంబంధితంచిన దస్తావేజు నెం.247/2020 తీసుకుని ది.26-07-2023న జిరాక్సు నిమిత్తం పెద్దాపురం మెయిన్ రోడ్డులో వెడుతుండగా పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు అందజేయ వలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉండవిల్లి వీర వెంకట రంగనాథ్
తండ్రి: సుబ్బారావు, డో.నెం. 7-7-1/1,
సత్తిరెడ్డిపేట, పెద్దాపురం, కాకినాడ జిల్లా.
సెల్: 97018 41544

చంద్రబాబుపై వైసిపి దాడి అమానుషం

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపై పుంగనూరులో వైసిపి రౌడి మూకల దాడి అమానుషమని మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడానికి మంత్రి పెద్దిరెడ్డి చేసిన దాడిని ఖండిస్తూ దుమ్ములపేట ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాయలసీమ ప్రాంతాన్ని తన సొంత జాగీరులా భావిస్తూ పాలన సాగిస్తున్నారని, రాష్ట్రంలో ఉన్న ఇసుక, మట్టిని పెద్దిరెడ్డి మైనింగ్ మాఫియాతో రూ.వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారన్నారు. పోలీసుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తలపై వైసిపి దాడి చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సునీత, చిక్కాల సత్యవతి, మీసాలు సునీత, మూగు చిన్ని, అంబటి చిన్న, తుమ్మల రమేష్, కోపనాతి నాగ కుమారి, నూరుకుర్తి లోవలక్ష్మి, పిర్ల లక్ష్మి ప్రసన్న, వడిసెల దాలమ్మ, కడలి వరలక్ష్మి, వీరంరెడ్డి వెంకట లక్ష్మి, వల్లపు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మురారిలో గడప గడపకూ..

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉప సర్పంచ్, యువ నాయకులు జాస్తి వసంత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు కచ్చితంగా చేరినందునే ఇంత ధైర్యంగా ప్రతి గ్రామంలో తిరుగుతున్నామన్నారు. గ్రామంలో వైసిపి పరిపాలన పట్ల పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంతగా లబ్ధి చేకూర్చిన పార్టీ పనితీరు పట్ల ప్రజలు సంతప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొరబాబు, జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, ఎఎంసి చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపిడిఒ వెంకటరామన్, తహశీల్దారు కెవిఎస్.సత్యనారాయణ, కార్యదర్శి పి.శిరీష పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ - మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వలసపాకల గ్రామంలో ఆమె పర్యటించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో గురినంచారు. వివరించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎఎంసి చైర్మన్ కర్రి వెంకట్రాజు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి మట్టా ప్రకాష్ గౌడ్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బుంగా సింహాద్రి నాయకులు తాతపూడి రామకృష్ణ, కొల్లుబోయిన సూరిబాబు, కొల్లుబోయిన అచ్యుత్, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కేశబోయిన ఏడుకొండలు, పాలిక ఉషారాణి, పలివెల త్రిమూర్తులు గాయత్రి, పిల్లి అప్పారావు, పిల్లి రామకష్ణ, బొజ్జ భవాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పార్టీకి పతనం మొదలైంది

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

రాష్ట్రంలో వైయస్సార్ పార్టీకి పతనం మొదలైందని పిఠాపురం మాజీ ఎంఎలఎ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. మూలపేటలో గ్రామ కమిటీ నాయకులు కంబాలి రమణ ఆధ్వర్యంలో వైసిపి నుంచి సుమారుగా 80 మంది మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ ఆధ్వర్యాన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మత్స్యకారు కుటుంబాలను ఆదుకోవడంలో విఫలం అయ్యిందన్నారు. కాలుష్య పరిశ్రమకు అనుమతులు ఇచ్చి వారికి జీవనాధారం లేకుండా చేసిందని తెలిపారు. మూలపేటలో టిడిపి హయాంలో 90 శాతం వరకూ రోడ్లు వేసి అభివద్ధి చేసామని, ఇక్కడ మత్స్యకారులకు ఉపయోగ పడేలా మల్టీపర్పస్ హాల్ కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయ కార్యాలయంగా మార్చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, మేరుగు సూరిబాబు, కంబాల రమణ, ఉప్పాక, మరియు మత్స్యకార నాయకులూ కొర్ని రమణ, సురాడ శ్రీను, మేరుగు భూషణం, చోడిపల్లి ప్రసాద్, వోసిపల్లి అప్పన్న, బొందు జగన్నాధం, సీకోటి నానాజీ, త్రిమూర్తులు, మరియు బత్తుల చైతన్య రాజేష్ పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి – కాకినాడ కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో సామర్లకోట రానున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. సీఎం పర్యటనలో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ తరుపున పైలాన్ ఏర్పాటుతోపాటు మరికొన్ని సౌకర్యాల కల్పన బాధ్యతను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగా డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులతో కలిసి పైలాన్ ఏర్పాటు పనులను పరిశీలించారు. అందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, ఇఇ పి.వెంకట్రావు, ఎఇ వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఎపిలో మహిళా జీవనోపాధి భేష్

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న మహిళా జీవనోపాధిపై హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర బందం శనివారం తాళ్లరేవులో పర్యటించారు. మండలంలో స్వయం సహాయ సంఘాలు నిర్మాణం, బలోపేతం, మహిళా సభ్యుల జీవనోపాధి, అభివద్ధిని వారు అధ్యయనం చేశారు. ఈ మేరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాదుల మిషన్ సిఇఒ అనిల్ శర్మ, మిషన్ ఎగ్జిక్యూటివ్ రిషి మాల్టా , ప్రాజెక్ట్ మేనేజర్ రజత్ శర్మ బృందం గోదావరి మహా సమాఖ్య మహిళా సభ్యులతో చర్చించారు. వారి జీవన ప్రమాణ స్థాయి ఏ విధంగా అభివృద్ధి చెందింది అనే విషయాలను సమాఖ్య సభ్యులు బృందానికి వివరించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. తాళ్లరేవు ఎంపిఎం అర్.సన్యాసిరావు, సిసి రఘురాం, వెంక టేశ్వర్లు, మహాలక్ష్మి, నూకరత్నం, సునీత, మహేష్, కె.నరేష్ పాల్గొన్నారు.

కాలువలో గుర్రపు డెక్క తొలగించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లి మూలపల్లి కాలువలో గుర్రపు డెక్క తొలగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం శాఖా కార్యదర్శి కె.నాగేశ్వరరావు కోరారు. శనివారం నాగులపల్లిలో కెవివి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రేషన్ ద్వారా కందిపప్పు ఇతర నిత్యావసర వస్తువులు ప్రజలకు అందేలా చూడాలని అధికారులు కోరారు. మండలంలో ఉన్న కాలవల్లో గుర్రపు డెక్క పెరిగి సాగు చేసేందుకు నీరు సక్రమంగా రావడం లేదని దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రాల అప్పారెడ్డి, జివి.సుబ్బిరెడ్డి, జి.సునీత, సిహెచ్.నారాయణరెడ్డి, జివి.లక్ష్మి పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి–పెదపూడి

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. గొల్లలమామిడాడ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1982-1983 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించినట్లు రెమ్మలపూడి రామకష్ణ చౌదరి తెలిపారు. సుమారు 40 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి యోగక్షేమాలు తెలుసుకుంటూ గడిపారు.

వీరాంజనేయులుకు డాక్టరేట్

ప్రజాశక్తి గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐత వీరాంజనేయులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. వీరాంజనేయులు సమర్పించిన ఎ జెడ్ 31/ ఎస్.ఐ.సి/ గ్రాఫిటీ రీన్‌ఫోర్స్ మెటల్ మ్యాట్రిక్స్ హైబ్రిడ్ మిశ్రమాలపై ఫాబ్రికేషన్, క్యారెక్టరైజేషన్ మరియు ట్రైబోలాజికల్ అధ్యయనాలు థీసిస్‌పై ఈ డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఆయనను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి అభినందించారు.